# ఒంటి స్తంభం మేడ

అనగనగా ఒకరాజు, ఆ రాజుకో కూతురు. ఆమెను రాజు ప్రాణప్రదంగా చూసుకునేవాడు. ఆమెను ఎవరేం చేసిపోతారో అని రాజుకు భయం. అందుచేత ఆ రాజు కూతురికోసం ఒక ఒంటి స్తంభం మేడ కట్టించాడు. అది ఒంటి స్తంభం మేడ కావటం చేత ఎవరూ సులభంగా పైకి ఎక్కటానికి లేదు. ఆ కారణం చేతనే, రాజు కూతురు మేడ దిగటానికి లేదు; కవచం అని తొడిగితే అదే నిర్బంధమయింది.

అయితే తాను నిర్బంధంలో ఉన్నట్టు రాజు కూతురికి తెలియదు. తనకు ఏం ప్రమాదం వస్తుందో ఆమెకు స్పష్టంగాతెలీదుగాని తనకా ప్రమాదం తప్పినందుకు ఆమె మనసులో ఎంతో సంతోషించినదై నిశ్చింతగా ఉండేది. ఒంటి స్తంభం మేడలో ఉన్నా రాజుకూతురికి రాజోపచారాలు నిరాఘాటంగా జరిగేవి - దాస దాసీజనులూ, బంగారు తూగుటుయ్యాలలూ, హంసతూలికా తల్పాలూ, మృష్టాన్నభోజనాలూ.

ఒకరోజు పెద్ద గాలి తుపాను వీచింది. రాజకూతురున్న మేడ తాలూకు ఒక్క స్తంభమూ కూలిపోయింది.

ఇది నేను స్వయంగా కట్టిన కథ, నేనే రాజు కూతుర్ని. నన్ను మా వాళ్ళు ఒంటి స్తంభం మేడలో ఉంచారు. అయితే అది ఒంటి స్తంభం మేడ అనే విషయం నాకు తెలీదు! మామూలు మేడే అనుకున్నాను.

మా నాన్న రాజుకాడు. కాకపోతే ఏం? మా వంశానికి రాజసం చాలా ఉంది. మా తాత అగ్రహారాలు ఏలాడు. అందలం ఎక్కి తప్ప బయటికి కదిలేవాడుకాడు. జిల్లా కలెక్టర్ల దగ్గిరనుంచీ ఆయన దర్శనం చేసుకొని, ఆయన ఇచ్చిన బహుమానాలు పట్టుకుపోయేవారు. ఆయన పంక్తిన ఇరవైమంది అయినా కూర్చోకపోతే ఆపోశన పట్టేవాడు కాదు. ఆయనకు నలుగురు సాని వాళ్ళుండేవారు.

మా నాన్న తరానికి రాజసం తాలూకు బాహ్య చిహ్నాలు శలవు పుచ్చుకున్నాయి. మనస్తత్వం మిగిలింది. మా నాన్న కూడా దేహీ అన్న వాడికి నహీ అనలేదు. ఆయన వేలకు వేలు దానధర్మాలు చేశాడు - అప్పుచేసి. ప్రజలు పలికే శుష్క ప్రియాలను ఆయన చాలా ఖరీదుకు కొనుక్కునేవాడు. తండ్రిని మించిన వాడనిపించుకోవటం కాదుగదా, తండ్రి అంత వాడని అనిపించుకోవటం

కూడా, పాపం, మా నాన్నకు చాతకాలేదు. మా నాన్న లోలోపల మా తాతను ద్వేషించేవాడని నాకు తెలుసును. ఫలాని వాడి కొడుకు అనే కీర్తితోనే మా నాన్న జీవయాత్ర గడపవలసి వచ్చింది.

మా తాతను ద్వేషిస్తూనే మా నాన్న తన తండ్రిని కీర్తి దాహం కొద్దీ అనుకరించాడు. తనూ ఒక ముండను పెట్టుకున్నాడు. మేనా ఎక్కి తిరగటానికి ప్రయత్నించాడు. మా నాన్నను చూసి కొందరు నవ్వారు. మరికొందరు చీదరించుకున్నారు, ఒక్కరన్నా హర్షించలేదు - ముఖస్తుతి గాళ్ళు తప్ప! అదైనా మా నాన్న ఎదటనే!

పాపం, మా నాన్న కీర్తి గూడా ఒంటి స్తంభం మేడే అయిపోయింది. దానికున్న ఒక్కస్తంభమూ డబ్బు. అది లోపల్నించి డొల్లబారిపోతుండటం మా నాన్న గ్రహించలేదు, అది ఫెళ్లున విరిగిపడేవరకూ.

2

నా పెళ్ళి నా పదోఏట అతి వైభవంగా జరిగింది. మా నాన్న నా పెళ్ళికి పదిహేను వేలు ఖర్చు చేశాడు - అప్పు చేసి. అప్పటికింకా మా యింట కిరాయిలక్ష్మి తాండవమాడుతూనే ఉంది.

నేను పదకొండో ఏట రజస్వల అయినాను. మరి మూడు నెల్లకు నా భర్త సన్నిపాతం వచ్చి చచ్చిపోయినాడు. సన్నిపాతం క్రిములవల్ల కలుగుతుందని శాస్త్రజ్ఞులు చెబుతారు. భార్యలు దుష్టనక్షత్రాన రజస్వల అయితే భర్తలకు సన్నిపాతం వచ్చి మూడోవారంలో కొట్టేస్తుంది. ఈ రహస్యం దైవజ్ఞులకే తెలుసు... ఏమైతేనేం నేను కూడా ఒక హత్యకు కారకురాలయిన దాన్నయినాను. యమధర్మరాజు కోర్టులో ఎప్పటికైనా నా మీద హత్యకేసు నడవకపోదు.

కేసు విచారణ ఆరంభం కాకముందే నాకు యమధర్మరాజు ఏజెంట్లు శిక్ష అమలు జరిపారు. నేను బొట్టుపెట్టుకోరాదు. రంగుచీరెలు కట్టరాదు. శుభకార్యాలకు పోరాదు. ఎవరికీ ఎదురుకారాదు. అయితే నాది కఠిన చెర కాదు. నేను రెండుపూటలా భోంచెయ్యవచ్చు. పూలు పెట్టుకోకుండా జెడ వేసుకోవచ్చు. జుట్టు తీయించుకోనవసరం లేదు.

యమధర్మరాజు ఏజెంట్లు నాకు చూపుతూ వచ్చిన దయకు తమను తాము నిత్యమూ అభినందించుకుంటూ నా కృతజ్ఞతను అర్థించేవారు. కృతజ్ఞత చూపటం నాకు చాతనయిందని చెప్పలేనుగాని కృతఘ్నత మాత్రం చూపలేదు యమకింకరులకు.

ఇల్లా ఉండగా ఒకరోజు - నా పదమూడోఏట - ఒక పెద్ద మనిషి - మా బంధు కోటిలో వాడే - ఎవరూ లేని సమయంలో నన్ను తన వొళ్ళోకి తీసుకొని, నా శరీరమంతా ఎంతో ప్రేమతో నిమిరి, నన్ను గట్టిగా తన రొమ్ముకు అదుముకుని, నన్ను ఉద్రేకంగా ముద్దులాడాడు.

ఆయనను నేను ప్రేమించానని చెప్పలేను. ప్రేమను గురించి కథలలో చదువుతున్న కొద్దీ దాని స్వరూపం ఏమిటో బొత్తిగా తెలియకుండా పోతున్నది. గమ్యస్థానం తెలియక దిక్కులేని పక్షిలాగా తిరుగుతున్న కామేచ్ఛ ఈ సంఘటనతో ఆయన మీద వాలింది.

ఈ సంఘటన జరిగినాక నా బాల్యం అంతమై యవ్వనదశ ఆరంభమైంది. నాకది ఒకవిధమైన రెండో పుటక. అనేక రోజులపాటు, నెలలపాటు, ఈ సంఘటన గురించి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా వొళ్ళు పులకరించి నా హృదయాన్ని ఎవరో గట్టిగా నొక్కేస్తున్నట్టుగా బాధకలిగేది. నిద్రాహారాలూ మిగతా ప్రపంచమూ మరిచిపోయి, మొహం మొత్తేవరకు ఆ అనుభవాన్నే పొందాలని ఆరాటంగా ఉండేది.

ఆ పెద్ద మనిషి నన్నెందుకి త్రిశంకు స్వర్గంలో వొదలాలి? నన్నాయన ఎక్కడికన్నా అడివిమధ్యకి, ఎడారిలోకి, కొండలమీదికి లేవదీసుకుపోయి నాకీ స్వర్గ సౌఖ్యం ఇవ్వరాదూ? ఈ సుఖం తనివిదీర అనుభవించినాక ఉరిపోసుకొని చచ్చిపోతే మాత్రమేం? ఆయనకు పిరికితనమా? నాకు లేదే? ఆయనకోసం కావలిస్తే నేను నట్టేట్లో దూకుతానే?

నాలో మార్పు మావాళ్ళు గ్రహించి ఉండాలి. నేను పరమరహస్యం అనుకుని నా కడుపులో దాచుకున్న ఈ విషయం మా వాళ్ళకు నా మొహం చూడగానే అర్థమై ఉండాలి. తమ రహస్య భావాలను అరితేరిన పెద్దవాళ్ళు ఎంత సులభంగా పసికడతారో యువకులు చచ్చినా గ్రహించలేరు.

## 3

కీర్తి అనే ఒంటి స్తంభం మేడలో కాపరం చేస్తున్న మా కుటుంబం నన్ను నీతి అనే ఒంటి స్తంభం మేడలో ప్రవేశ పెట్టింది.

మా నాన్న నాతో స్పష్టంగా చెప్పాడు: "నీ పూర్వజన్మ పాపం వల్ల నీ మొగుడు పోయినాడు. నిన్ను చూస్తే మాకు విచారం లేదనుకోకు. నీ జీవితం ఎంత దుర్భరమో మాకు తెలుసు. వంశ గౌరవం అడ్డురాకపోతే నిన్నీవాళే ఎవరికైనా ఇచ్చి విధవావివాహం చేతును. కాని అటువంటిది ఈ పవిత్ర వంశంలో జరగటానికి వీల్లేదు. నా బొందెలో ఊపిరి ఉండగా నా చేతిమీదిగా నేను విధవావివాహం చెయ్యను. నా కుటుంబాన్ని ఒకరు వేలుమడిచి చూపటం నేను భరించలేను. ఈ విషయాలు నువు అర్థం చేసుకోవాలి. నువు చాటుమాటు వ్యవహారాలు చేసినా నేను సహించేవాణ్ణికాను. భగవంతుడు నీ జీవితానికి ఈ కళంకం తెచ్చి పెట్టాడు గనక నేను ఇతరత్రా నీకే లోటూ జరగకుండా చేస్తాను. ఎవరూ చూడకుండా నువు పూలుపెట్టుకో, సిల్కు చీరలుకట్టుకో, నా కభ్యంతరంలేదు. కాని వంశ మర్యాదకు చిన్న మెత్తు కళంకం తెచ్చినా నిన్ను బయటికి పంపేస్తాను జాగర్త! ప్రపంచంలో కళ్ళు లేకుండా, కాళ్ళు లేకుండా బతికేవాళ్ళున్నారు. పుట్టింది మొదలు చచ్చేదాకా మంచంలో పడితీసుకునేవాళ్ళున్నారు. విధవత్వం అంతకన్న ఘోరమైనతి కాదు."

చాటుగా పూలూ, చీరెలూ పనికివస్తే, యెవరూ చూడకుండా ముద్దులెందుకు పెట్టించుకోరాదో, నాకు అర్థం కాలేదు. కాని ఈ ఆలోచన నాకు అప్పుడు కలగలేదు. అప్పటిమట్టుకు

నా శరీరం భయంతో బిగుసుకుపోయింది. మా నాన్న నాతో అట్లా ఎన్నడూ మాట్లాడలేదు. అసలే ఆయన మితభాషి. పిల్లలం చాలా భయభక్తులతో పెరిగినవాళ్ళం. పరాయివాళ్ళ యెదట "నాన్నగారూ" అని పిలవవలసిందేగాని చనువుగా "నాన్నా" అనటానికి కూడా లేదు మాకు.

మా నాన్న ఇచ్చిన ఉపన్యాసంతో నాలో సహజంగా తలయెత్తిన కామేచ్ఛ దాదాపు పూర్తిగా అణచబడింది. మా నాన్న నాకిచ్చిన ఉపన్యాసంతో నన్ను వదలలేదు. అవకాశం దొరికినప్పుడల్లా నేను వింటుండగా ఇతరులదగ్గిర సుఖవ్యాధులను గురించి, భ్రూణ హత్యలను గురించి భయంకరమైన కథలు చెప్పేవాడు. ఈ నాటి సంఘంలో సంసార్లలోనే నూటికి అరవైమంది సుఖరోగాలతో బాధపడుతున్నారట. కాలుజారిన ప్రతి ఆడదానికి కడుపు అవుతుందిట. భ్రూణ హత్య చేయించినందుకు ఎంతోమంది వైద్యులు జైల్లో పడ్డారుట. ఎందరో ఆడవాళ్ళు వాయువు కమ్మి చచ్చారుట. అనేకమంది ఆడవాళ్ళు క్షణం సుఖంకోసం ఇల్లు వెడలగొట్టించుకొని భోగం వృత్తిలోపడి కుమిలిపోతున్నారుట.

ఈ కథలు – నిజమో, అబద్ధమో భగవంతుడికే తెలియాలి – నాలో కామేచ్ఛ పూర్తిగా అంతరించింది. ఎవడన్నా నాకేసి చూస్తేనే రోగాలు తగులుతాయని, నన్ను ముద్దుపెట్టుకుంటేనే కడుపైపోతుందని నాకు పూర్తిగా నమ్మకం ఏర్పడిపోయింది.

4

తలవనితలంపుగా, ఫెళఫెళారావాలతో, అందరమూ నివ్వెరపడిచూస్తుండగా మా కీర్తి మేడను ఇన్నాళ్ళూ నిలబెట్టి ఉంచిన ఒంటి స్తంభం కాస్తా కూలిపోయింది.

ఉన్న అప్పు తీర్చటానికి మానాన్న కొత్త అప్పులు పుట్టించలేకపోయినాడు. ఉన్న ఆస్తి అమ్మజూపితే అప్పులుతీరేటట్టు కనిపించలేదు. ధరలు పడిపోవటం వల్ల ఉన్న ఇల్లూ, ఆస్తి, వెండి, బంగారమూ అన్నీ అమ్మినా అప్పుతీరే అవకాశం కనిపించలేదు. అయినకాడికి ఉన్నది తెగనమ్మి అప్పులవాళ్ళకి సర్దటం ఎక్కువ గౌరవప్రదమా, లేక తుచ్ఛమైన లౌకిక వ్యవహారాల పట్ల నిర్లిప్తత అవలంబించి అప్పులవాళ్ళనే ఆస్తి వేలం వేయించుకుపోనివ్వటం గౌరవప్రదమా, లేక దక్కినంత ఆస్తి కుటుంబంలో వ్యక్తులపేర దక్కించి దివాలా ఎత్తటం గౌరవప్రదమా అనే విషయం మా నాన్న నిర్ణయించుకోలేకపోయినాడు. పాపం, ఆయన బుద్ధి తెలిసిన నాటినుంచీ సంఘ గౌరవాన్ని ఆరాధించినా ఆయనకు దాని తిరుగుళ్ళు బోధపడనేలేదు.

అయినా ఈ సంఘ గౌరవంలో మా నాన్నకు విశ్వాసం చాలక మా ఆడవాళ్ళ ఒంటి మీది బంగారం కూడా అప్పులవాళ్ళకు ఆహుతిచేసి అందర్నీ కట్టుబట్టలతో వీధిలో నిలబెట్టి తన వంశ మర్యాద దక్కించుకున్న వాడైనాడు.

ఇల్లు లేకపోవటం ఏమిటో, తిండి లేకపోవటం ఏమిటో, ఒకరి దయాధర్మ బిచ్చం మీద ఆధారపడటం ఏమిటో మా కుటుంబానికి తెలిసి వచ్చింది. ఇంగ్లండుకు వెళ్ళటానికి

కలలుకంటున్న మా అన్నలిద్దరూ చెరొక నలభై రూపాయల ఉద్యోగానికి పాల్పడ్డారు. మా నాన్నకు ఆ శక్తి కూడా లేదని రుజువయింది.

మా అన్నలకు ఉద్యోగాలు దొరకటంతో, మూడో అంతస్తునుంచి కింద పడుతున్నవాడికి వలపట్టినట్టయింది. ప్రాణం దక్కిందిగాని లేచి నిలబడి స్వేచ్ఛగా అంటూ ఇటూ కదలటానికి లేదు.

ఎనభై రూపాయలతో చాలా పెద్దెత్తుగానే బతకవచ్చునని మా నాన్న గ్రహించాడు. మళ్ళీ ఆయనకు కొత్త ప్రాణం వచ్చినట్టయింది. కాటకం మూలంగా జీవనం కారు చౌక అయింది. పదిరూపాయలు అద్దె ఇస్తే లంకంత ఇల్లు, నాలుగు రూపాయలు పారేస్తే ఇద్దరు నౌకర్లు, పది రూపాయలు పారేస్తే బియ్యం బస్తా. అణా కూరలు కొంటే ఇద్దరు అతిథులను మేపవచ్చు.

ఈ మారిన పరిస్థితులలో కూడా పాతపద్ధతిలోనే కుటుంబ మర్యాద నెరపటానికి కంకణం కట్టుకున్నవాడై మా నాన్న ఇంటికి – అద్దె ఇంటికి – ఆధ్వర్యం వహించాడు. కాగా, కుటుంబంలో అందరి గౌరవమూ హెచ్చింది ఈ దెబ్బతో, ఒక్క నా గౌరవం తప్ప. నా అన్నలిద్దరూ సంపాదకులు కనక వారు దాదాపు మా నాన్న తరవాత ఇంటికి అంతవాళ్ళూ అయినారు. మా అమ్మ పుస్తె మినహా వొంటి నగలన్నీ ఇచ్చేసింది. నేనా? నా పెళ్ళికి అయిన ఖర్చులో – ఫలానివారు చేసిన ఖర్చుకాదు, కేవలమూ అయిన ఖర్చులో – ముష్టి నా నగలేపాటి? నాకు పెళ్ళి జరగకుండా ఉంటే మా కుటుంబం ఈ ఆర్థిక సంక్షోభానికి గురి అయ్యేదికాదని మా కుటుంబం ఏకగ్రీవంగా ఆమోదించింది.

నేను పెళ్ళికాకుండా రజస్వల అయివుంటే కుటుంబ గౌరవం ఏమై ఉండేదన్న జిజ్ఞాస ఎవరికీ కలగలేదు. కారణమేమంటే కుటుంబ గౌరవానికి వెనక ఉన్న పలుకుబడి ఇప్పుడు ఉండటం మానేసింది.

## 5

కాని మా నాన్న అనుకున్నట్లుగా గ్రంథం జరగలేదు. మా నాన్న అంచనాల ప్రకారం కుటుంబ గౌరవార్థం ఇంకా నెలకు వందచొప్పున ఖర్చయే ధోరణి చూసి మా అన్నలు మా నాన్నను పెత్తనం నుంచి తొలగించేశారు.

నా అన్నలు ముందు ఆలోచనతో కొందరు స్నేహితుల ఆదరణ స్వీకరించారు. ఈ స్నేహితులు డబ్బుగలవారు. ఏ కాటకంలో మా కుటుంబం అధోగతి పాలయిందో, ఆ కాటకంలోనే వారు పైకి వచ్చారు. తిరిగి పుచ్చుకునే ఆలోచన లేకుండా వాళ్ళు మా అన్నలకు రూపాయీ, అర్ధా అరువివ్వగలరు. మా అన్నలకు గొప్ప వాళ్ళ పరిచయమూ, అయిదూ పదీ కమీషను తెచ్చుకునే అవకాశాలూ ఇవ్వగలరు.

మా అన్నల స్నేహితులలో శ్రీహరిరావనే ఆయన ఒకడున్నాడు. ఆయన మాకు ఆప్తమిత్రుడైనాడు. ఆయనకు తరచు మా ఇంట్లో భోజనం పెట్టేవాళ్ళం. ఆయన వయస్సు 35, 40 మధ్య ఉంటుంది. తలవెనక కొంచెం బట్టతల. ముగ్గురు పిల్లల తండ్రి.

ఈ శ్రీహరిరావు నాకేసి చాలా ఆకలిగా చూసేవాడు. ఒకప్పుడు ఆవలిస్తే పేగులు లెక్కబెట్టిన మా వాళ్ళ కళ్ళకు ఇప్పుడు పొరలెందుకు కమ్మాయో నాకర్థం కాలేదు. ఒకరోజు ఈ పెద్దమనిషి ఒంటరిగా నా మీద చెయ్యి చేసుకున్నాడు. నేను మా అమ్మతో చూచాయిగా చెప్పాను. మా అమ్మ నాన్నతో అన్నట్టుంది. ఆయన ఆకాశమంత ఎత్తు ఎగిరి ధూముధాములు చేశాడు. శ్రీహరిరావు ఇంటికి వస్తే కాళ్ళు విరగగొడతానని శపథం చేశాడు.

మా అన్నలు ఇదంతా విని నన్నూ, మా అమ్మనూ, మా నాన్నను కూడా నానా తిట్లు తిట్టారు. తిట్లు నాకే జాస్తి తగిలాయి. నాకు తిని పడుండే యోగ్యత లేక తమ ఆప్త స్నేహితులమీద లేనిపోని చాడీలు చెబుతున్నానన్నారు.

నేను నోరెత్తలేదు.

కొంతకాలానికి సుస్తీ చేసింది. వైద్యుడికి చూపించారు మా అన్నలు – వైద్యుడు ఏం చెప్పాడో తెలియదు. మా అన్నలు మాత్రం ఇంట్లో నాకు అతి ఉష్ణం చేసిందన్నారు. 'అతి ఉష్ణం' నివారణ చేయించుకోవటానికి నేను నలభై ఇంజక్షన్లు పుచ్చుకున్నాను. ఆ ఖర్చు శ్రీహరిరావే ఇచ్చుకున్నాడు. పాపం! ధర్మాత్ముడు.

మరికొంత కాలానికి అతి పైత్యం ఆరంభించింది. దాని నివారణకు నేను మరో ఊరుపోయి ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఉండవలసి వచ్చింది.

శ్రీహరిరావు – "నీ ప్రాణానికేం ప్రమాదంలేదు. భయపడకు" అని అభయమిస్తూ చుట్టవాసనకొట్టే నోరు నా నోటికి గట్టిగా అదిమిపెట్టి ముద్దు పెట్టుకున్నాడు.

కడుపుకాలే అమ్మకు గంజే పానకం.

మా కుటుంబం కీర్తి మేడ కూలిననాడే నా నీతి మేడ కూడా కూలిపోయిందని నేను గ్రహించలేదు. రెండు మేడలకూ ఒకటే స్తంభం మరి.

❄

ఆంధ్రజ్యోతి మాసపత్రిక, మే 1949